క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 20, పచ్చిమిర్చి 50, బెండ 35, కాకర 80, దొండ 30, దోస 25, ఆలు 25, చామ 50, కీర 25, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 140, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 80, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 120.

నేటి నుంచి కంటివెలుగు ప్రారంభం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి 21వ వార్డులో ఈ నెల 16 నుంచి 29 వరకు కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.సాయినగర్‌లోని బస్తీ దవాఖాన ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే కంటి వెలుగు శిబిరంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అవసరమైన వారందరికీ కంటి అద్దాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. కంటి పరీక్షలకు వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డును తీసుకురావాలని సూచించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారం



పనులు చేపట్టిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది

రాయదుర్గం: కేశవనగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను సోమవారం జలమండలి అధికారులు పరిష్కరించారు. గత మూడు రోజులుగా గచ్చిబౌలి డివిజన్ కేశవనగర్‌లో మురుగు కాలువలన్నీ వ్యర్థాలు, చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు సమీపంలోని ఇళ్ళలోకి పారడంతో బస్తీవాసులు నానా ఇబ్బందులు పడ్డారు. దుర్వాసనతోపాటు ఇంట్లోకి మురుగు రావడంతో భరించలేక పోయారు. ఈ నేపథ్యంలో స్థానిక నాయకులు తిరుపతి, శ్రీనివాస్, ఈశ్వర్, రాజు, సాయిలు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు, సిబ్బంది బస్తీకి చేరుకొని డ్రైనేజీ కాలువలను, మ్యాన్ హోల్స్ ను శుభ్రం చేయించారు.

స్పోర్ట్స్ కిట్లు అందజేత

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ ఏడవ ఫేజ్ మైదానం వద్ద సమ్మర్‌క్యాంప్ సందర్భంగా సోమవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు జీహెచ్‌యంసీ స్పోర్ట్స్ కిట్లను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారన్నారు.కార్యక్రమంలో అంజిబాబు, ప్రతాప్, వెంకటరమణ, వెంకటేశ్వరరావు, అప్పారావు, లక్ష్మీనారాయణ, విశ్వనాథం, శ్రీనివాస్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకోవాలి

పటాన్‌చెరు టౌన్: మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకోవాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం కార్పొరేటర్ కుమార్‌యాదవ్ తన జన్మదినాన్ని జేపీ కాలనీలోని శ్రీవాణి సాంఘిక సేవా కేంద్రంలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు 10 కుట్టుమిషన్‌లు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్ పాల్గొన్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం 16 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. 10 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు.. గృహిణి ఆత్మహత్య



పార్వతి (ఫైల్)

గచ్చిబౌలి: అదనపు కట్నం కోసం భర్త వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకోల్ గ్రామం, పెద్దకొత్తపల్లి, నాగర్‌కర్నూల్‌కు చెందిన పెబ్బేటి వెంకమ్మ కూతురు పార్వతి(30)తో రాయదుర్గంవాసి విజయ్‌కుమార్‌తో 10 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. నిత్యం అదనపు కట్నం కోసం వేధిస్తుండంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంట్లో ఉరి వేసుకొంది. వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి వెంకమ్మ రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

17న పాలిసెట్ ప్రవేశ పరీక్ష



మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ

- గచ్చిబౌలి ప్రాంతంలో 5 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 1,170 మంది విద్యార్థులు
- ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అనుమతి లేదు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

పరీక్షా కేంద్రాలు	విద్యార్థులు
జీఐఎల్‌టీ రాయదుర్గం	150 మంది
జెడ్పీహెచ్‌ఎస్ గచ్చిబౌలి	240 మంది
ప్రభుత్వ జూనియర్ కళాశాల మధురానగర్	240 మంది
జెడ్పీహెచ్‌ఎస్ మణికొండ	240 మంది
జెడ్పీహెచ్‌ఎస్ నార్సింగి	300 మంది

రాయదుర్గం: పాలిసెట్ ప్రవేశ పరీక్ష–2023 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్ టెక్నాలజీ (జీఐఎల్‌టీ) పరిసరాల్లోని గచ్చిబౌలి ప్రాంతంలో అయిదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 17వ తేదీ (బుధవారం) జరగనున్న ప్రవేశ పరీక్షను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహిస్తారు. రాయదుర్గం, గచ్చిబౌలి, మధురానగర్, మణికొండ, నార్సింగి ప్రాంతాలలోని ప్రభుత్వ విద్యాసంస్థలను పరీక్షా కేంద్రాలుగా ఎంపిక చేశారు.

గంట ముందే రావాలి



ఈనెల 17వ తేదీన పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే గచ్చిబౌలి పరిసరాల్లోని అయిదు పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశాం. ఈ అయిదు కేంద్రాలలో 1,170 మంది విద్యార్థులు పాలిసెట్ ప్రవేశ పరీక్ష వ్రాయనున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను లోపలికి అనుమతించరు. పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందే రావాలి. పరీక్షా కేంద్రంను సులువుగా గుర్తించేలా ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–షేక్ ఎక్బాల్ హుస్సేన్, జీఐఎల్‌టీ, రాయదుర్గం ప్రిన్సిపల్

విద్యార్థులు పాటించాల్సిన నిబంధనలు ..

- ప్రతి విద్యార్థి కరోనా జాగ్రత్తలు పాటించాలి
- పరీక్షా కేంద్రం గురించి వెంటనే తెలుసుకునేందుకు యాప్–ఎస్‌బీటెట్ టీఎస్ ద్వారా గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంటుంది. యాప్‌ను వినియోగించి ఒకరోజు ముందే పరిశీలించాలి.
- ప్రతి విద్యార్థి హెచ్‌బీ పెన్సిల్‌ను మాత్రమే వినియోగించాలి.
- హాల్‌టికెట్, పెన్, హెచ్‌బీ పెన్సిల్, షార్ప్‌నర్, ఎరేజర్‌ను మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు.
- ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను లోపలికి అనుమతించరు.
- ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఫోన్ నంబర్ 9912342053లో సంప్రదించాలి.

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ జాం



గచ్చిబౌలి స్టేడియం వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం

- కొండాపూర్ రోడ్డు మూసివేతతో ఇక్కట్లు
- కిలోమీటర్ల కొద్ది బారులుదీరిన వాహనాలు



గచ్చిబౌలి ఇందిరానగర్‌లో..

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లో కిలోమీటర్ల కొద్ది వాహనాలు బారులుదీరాయి. దీంతో వాహనదారులు ఇక్కట్లుపడ్డారు. కొండాపూర్ రోడ్డు మూసివేతతో గచ్చిబౌలి నలుదిక్కుల ప్రధాన రహదారులలో ట్రాఫిక్‌జాం నెలకొంది. బంపర్ టు బంపర్ అన్నట్లుగా రాకపోకలతో అటు వాహనదారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు ఇబ్బందులకు గురయ్యారు. ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి లెవల్–2 ఫ్లైఓవర్ నిర్మాణ పనులు సజావుగా సాగేందుకు గచ్చిబౌలి జంక్షన్ నుంచి రాడిసన్ హోటల్ వరకు కొండాపూర్ రోడ్డును రెండు వైపులా శనివారం మూసివేశారు. వీకెండ్ కావడంతో రెండురోజులు పెద్దగా ట్రాఫిక్ జామ్ కాలేదు. సోమవారం టెక్కీలు కంపెనీల బాటపట్టడంతో రోడ్లపై ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పటాన్‌చెరు, ఆర్సీపురం, లింగంపల్లి, చందానగర్ నుంచి వాహనదారులతో హెచ్‌సీయూ నుంచి గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ జంక్షన్ వరకు ట్రాఫిక్‌జామ్ నెలకొంది. కొత్తగూడ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మెహిదీపట్నం వైపు వెళ్లే వాహనాలు రాంకీ టవర్స్ మీదుగా మైండ్ స్పేస్ జంక్షన్‌కు చేరుకున్నాయి. మెహిదీపట్నం నుంచి డీఎల్‌ఎఫ్, కొత్తగూడ వైపు వెళ్లే వాహనాలు బయోడైవర్సిటీ జంక్షన్ నుంచి మైండ్ స్పేస్ జంక్షన్‌ను చేరుకున్నాయి. జంక్షన్ జామ్ కావడంతో రాంకీ రోడ్డు, మైండ్ స్పేస్ నుంచి బయోడైవర్సిటీ వరకు, బయోడైవర్సిటీ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు, శిల్పా లేఅవుట్ ఫ్లైఓవర్ ర్యాంప్ , గచ్చిబౌలి జంక్షన్ నుంచి ట్రిపుల్ ఐటీ జంక్షన్ వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మైండ్‌స్పేస్ జంక్షన్, గచ్చిబౌలి, ట్రిపుల్‌ఐటీ జంక్షన్‌లు దాటేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. దీంతో కేబుల్ బ్రిడ్జి, సైబర్‌టవర్ జంక్షన్లపై తీవ్ర ప్రభావం చూపింది. దాదాపుగా ఐటీ కారిడార్‌లో కంపెనీలకు వెళ్లే టెక్కీలు ఇబ్బందులుపడ్డారు.

రెండు గంటలపాటు..

ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ట్రాఫిక్ స్తంభించిపోయింది. మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ జంక్షన్లను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ నాయక్, ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్‌లు పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ఏసీపీ హన్మంతరావు, ట్రాఫిక్ సీఐలు నవీన్ , శ్రీనాథ్‌లు సిబ్బంది, లా అండ్ ఆర్డర్ పోలీసులు విధులు నిర్వహించారు. రెండు గంటల అనంతరం ట్రాఫిక్ తగ్గడంతో పోలీసులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

అత్యవసర సమావేశం

కొండాపూర్ రోడ్డు మూసివేత, అనంతరం నెలకొన్న ట్రాఫిక్ సమస్యలపై సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ట్రాఫిక్ పోలీసు అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించారు. ఏఏ రోడ్లను వన్‌వే చేయాలి, కొండాపూర్ రోడ్డులో ఒక వైపు వాహనాల రాకపోకలను అనుమతిస్తే ఎదురయే సమస్యలేమిటి, ప్రస్తుతం నెలకొన్న ట్రాఫిక్ సమస్య ప్రత్యామ్నాయం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

చదువుతోపాటు మిగతా రంగాలలోనూ రాణించాలి



క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న వీసీ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించేలా ప్రయత్నించాలని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సూచించారు. సోమవారం యూజీసీ ద్వారా జీ–20 యూనివర్సిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించే అంతర్ హాస్టల్స్ విద్యార్థుల క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కాగా బాలురకు 3కె రన్, బాలికలకు 2కె రన్ పోటీలను వీసీ జెండా ఊపి ప్రారంభించారు. బాలుర 3కె రన్ విజేతలుగా షాబాద్ మంజూర్, బాలిక రన్ విజేతగా సైమాపర్వీన్ నిలిచారు. వారిని వీసీ, ఇతర ప్రొఫెసర్లు అభినందించారు. కాగా ఈనెల 21వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్, ఉపన్యాసం, వ్యాసరచన, క్విజ్, బైట్‌బాజీ, గానం, మిమిక్రీ, మైమ్ వంటి పోటీలను నిర్వహిస్తారు.

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లోని శ్రీ అభయ వీరాంజనేయ స్వామి ఆలయ ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నిర్వహించిన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీను, గుమ్మడి శ్రీనివాస్, సంజీవరెడ్డి, శివాజీ, ప్రభాకర్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సరిపడా నీరు సరఫరా చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని కాలనీవాసులకు సరిపడా తాగునీరు అందించాలని కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి జలమండలి అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం శేరిలింగంపల్లి హఫీజ్‌పేట్‌లోని జలమండలి జీఎం రాజశేఖర్‌ను కలసి తాగునీటి సమస్యలను వివరించారు. నీటి బిల్లుల విషయంలో గతంలో జలమండలి ఎండీ దానకిషోర్ ఆదేశాలను త్వరగా అమలుచేయాలని అధికారులను కోరగా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బ్రాహ్మణ సదన్‌ను సందర్శించిన అధికారులు

ఈనెల 31న ప్రారంభించనున్న సీఎం



బ్రాహ్మణ సదన్ భవనాన్ని పరిశీలిస్తున్న రమణాచారి, ఇతర అధికారులు

రాయదుర్గం: శేరిలింగంపల్లిలోని గోపన్‌పల్లి పరిధిలో నిర్మిస్తున్న బ్రాహ్మణ సదన్‌ను అధికారులు సోమవారం సందర్శించారు. ఈనెల 31వ తేదీ సీఎం చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్న బ్రాహ్మణ సదన్‌ను ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ రమణాచారి, ఇతర ఉన్నతాధికారులు, జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శంకరయ్య, శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ వెంకన్న, ఇతర జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రమణాచారి పలు సూచనలు చేశారు.

రాజీవ్ గృహకల్పలో బీజేపీ నాయకుల పర్యటన

మియాపూర్: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, పాపిరెడ్డి కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయని, బీఆర్‌ఎస్ నాయకులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు గజ్జల యోగానంద్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప పాపిరెడ్డి కాలనీలో 49వ రోజు సోమవారం పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, దాయర గ్రామాలలో రూ.70లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అమీన్‌పూర్ ఎంపీపీ దేవానంద్, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, సర్పంచ్ భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుండి జాతీయ రహదారి వరకు జీహెచ్‌ఎంసీ నిధులు రూ.29 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రతి డివిజన్‌లో ఇప్పటికే ఐదు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

రెండిళ్లలో చోరీ

పటాన్‌చెరు టౌన్: తాళం వేసిన రెండు ఇళ్లలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన ముక్కుంజామీ ఈ నెల 12వ తేదీన తాళం వేసి హైదరాబాద్‌లో ఉండే అత్తగారింటికి వెళ్లాడు. 14వ తేదీన స్థానికులు ముక్కుంజామీకి ఫోన్ చేసి మీ ఇంటి తాళం పగలగొట్టి ఉందని చెప్పడంతో ఇంటికి వచ్చిన అతను లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, వెండి ఆభరణాలు పోయాయని గుర్తించాడు. ఈ విషయాన్ని పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు.

మరో సంఘటనలో

ముక్కుంజామీ ఇంటి ముందు నివాసం ఉండే శ్రీనివాస్‌రావు ఇంట్లో కూడా రెండు తులాల బంగారం, కొంత నగదు పోయినట్లు అతను కూడా ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత నిమోలియా(35) నాలుగు రోజుల క్రితం బతుకుతెరువు కోసం సుల్తాన్‌పూర్‌లోని మెడికల్ డివైస్ పార్క్‌లో పనిచేయడానికి వచ్చాడు. ఆదివారం రాత్రి నడుచుకుంటూ రోడ్డుపైకి వెళ్లిన లక్ష్మీకాంత తిరిగి రాలేదు. దీంతో వరుసకు సోదరుడైన సంజయ్ వెతుకుతూ వెళ్లగా, రోడ్డుపై టిప్పర్ ఢీకొని మృతి చెందిన లక్ష్మీకాంత కనిపించాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. సంజయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్లాస్ డోర్ తొలగించి చోరీ

రామచంద్రాపురం (పటాన్ చెరు): వంటగది గ్లాస్ డోర్ తొలగించి గుర్తు తెలియని దుండగులు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం..రామచంద్రాపురం పట్టణంలోని శ్రీ సాయి నగర్ కాలనీలోని అపార్ట్‌మెంట్లో నివాసముండే ధీరజ్కుమార్ ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 14వ తేదీ రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఆ సమయంలో అతని తల్లిదండ్రులు ఇంట్లోనే ఉన్నారు. తిరిగి సోమవారం మధ్యాహ్నం ఇంటికొచ్చేసరికి వంటగది గ్లాస్ డోర్ తెరిచి ఉంది. దాన్ని గమనించిన ధీరజ్ కుమార్ అతని గదిలోకి వెళ్లి చూశాడు. మూడు గ్రాముల బంగారు ఆభరణాలు, ఆరు తులాల వెండి పట్టగొలుసు, కెమెరా చోరీ అయినట్లు గుర్తించాడు. సోమవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ విక్రేతల అరెస్ట్

మియాపూర్: నిషేధిత గంజాయి, డ్రగ్స్ విక్రయాలు చేపడుతున్న ఐదుగురు నిందితులను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుండి ఎండీఎంఏ డ్రగ్స్ 4 గ్రాములు, 800 గ్రాముల గంజాయి, ఆరు మొబైల్ ఫోన్లు, మూడు పెన్సిల్ ఇంజక్షన్లు ,ఒకటి మినీ త్రాసు (వేయింగ్ మిషన్) ను స్వాధీనం చేసుకొని సోమవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రఘు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు శేరిలింగంపల్లిలోని ఆదర్శ్‌నగర్ బస్టాప్ వద్ద చందానగర్ పోలీసులు ఆదివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న మహారాష్ట్రకు చెందిన మహ్మద్ సయ్యద్(30), ముంబాయికి చెందిన శుభం సంతోష్ మానే (21), హైదరాబాద్‌లోని ఎస్‌ఆర్ నగర్ చెందిన పాతికనేటి వెంకటేష్ (25),టోలిచౌకికి చెందిన అబ్దుల్ ఫిరోజ్ (26), మహ్మద్ సైఫ్ (26) లను అదుపులోకి తీసుకొని విచారించగా డ్రగ్స్ క్రయవిక్రయాలు చేస్తున్నట్లు అంగీకరించారు. ఆఫ్రికన్ సమ్మీ వద్ద నుండి గంజాయి, డ్రగ్స్‌ను రూ.2 వేల రూపాయలకు కొనుగోలు చేసి అవసరమైన వారికి రూ.4 వేలకు అమ్ముతున్నారు. ప్రధాన నిందితుడైన ఆఫ్రికన్ వ్యక్తి సమ్మీ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఐదుగురిని చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాపోటీలలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ముఖ్యమంత్రి కప్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. అందులో భాగంగానే నియోజకవర్గంలోని అన్ని కేంద్రాల్లో ముఖ్యమంత్రి కప్ క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజల పాటు నిర్వహించే క్రీడా పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి, బూరుగడ్డ పుష్పనగేష్, తహశీల్దార్ జయరాం, జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ బాలయ్య, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 6 లక్షల విరాళం

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని లింగమయ్య కాలనీలో శ్రీ సిద్ధి వినాయక వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న సామాజిక భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే ఆరు లక్షల రూపాయల సొంత నిధులను అందజేశారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నాయకులకు స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో చెక్కు అందజేశారు. ఈ అమీన్‌పూర్ జెడ్పీటీసీ సభ్యుడు సుధా కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఉపేందర్ రెడ్డి, చంద్రశేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

సైబరాబాద్‌లో స్పెషల్ డ్రైవ్

8 రోజుల్లో మొత్తం 1050 కేసులు నమోదు



రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈనెల 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 15 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కొనసాగిన డ్రైవ్‌లో 1050 కేసులు నమోదు చేశారు. సీపీ స్టీఫెన్ రవీంద్ర సూచనలపై ఈ డ్రైవ్ కొనసాగింది. ముఖ్యంగా అక్రమ సైరన్లు, మల్టీటోన్ హారన్లు, టింటెడ్ గ్లాస్ బ్లాక్ ఫిల్మ్ కట్టడి చేసేందుకు ఈ డ్రైవ్ నిర్వహించారు. టింటెడ్ గ్లాస్ బ్లాక్ ఫిల్మ్ ఉల్లంఘనలు నేర కార్యకలాపాలకు దారి తీస్తున్నాయన్నాయని సైబరాబాద్ జాయింట్ కమిషనర్ (ట్రాఫిక్) కె నారాయణనాయక్ స్పష్టం చేశారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికార సైరన్‌లు వాడే అన్ని వాహనాలను అదుపులోకి తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. ఇతర సైరన్‌లను వినియోగించడం చట్టవిరుద్ధమని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. డీసీపీలు హర్షవర్ధన్, శ్రీనివాసరావు, సైబరాబాద్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై నివేదిక సిద్ధం చేయాలి

ఎమ్మెల్యేలు గాంధీ, వివేకానంద్



మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులకు సూచించారు. సోమవారం మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిజాంపేట్ మేయర్ నీలా రెడ్డి, ఆయా విభాగాల ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ సమస్యలు అధిగమించేందుకు నూతనంగా చేపట్టనున్న ఫ్లైఓవర్, రోడ్ల అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. జేఎన్‌టీయూ నుండి ప్రగతినగర్ వెళ్లే రోడ్డులో నిత్యం వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఫ్లైఓవర్ ఏర్పాటుకు జూన్ 1వ తేదీ వరకు ప్రణాళిక సిద్ధం చేసి తమ దృష్టికి తీసుకువస్తే ఆ నివేదికను మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా మియాపూర్‌లోని సర్వే నంబర్ 170 వద్ద లింకు రోడ్డు నుండి నిజాంపేట్ కమాన్ వరకు ప్రధాన రోడ్డు విస్తరణ పనులను, నిజాంపేట్ నుండి ప్రగతినగర్ వరకు రోడ్డు అభివృద్ధి పనులకు అవసరమయ్యే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మియాపూర్ నుండి గండి మైసమ్మ వరకు రూ.130 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నిజాంపేట్ కమిషనర్ రామకృష్ణారావు, ఎస్‌ఆర్‌డీపీ ఎస్‌ఈ వెంకటరమణ, హెచ్‌ఆర్‌డీసీఎల్‌ఈఈ సర్దార్ సింగ్, కూకట్‌పల్లి టౌన్ ప్లానింగ్ సీపీ ఉమాదేవి, డీసీపీ రఘునందన్, ఏసీపీ రాణి, కూకట్‌పల్లి జోన్ ఎస్‌ఈ చెన్నారెడ్డి, ఈఈ గోవర్ధన్, ఎస్‌ఈ ఆనంద్, నారాయణ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నాలా విస్తరణ పనులు పరిశీలన

చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ వద్ద రూ.90 లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న నాలా విస్తరణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ శివప్రసాద్, టీపీఎస్ మౌనిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ రఘు, డివిజన్ల అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.